నిక్షేపము

రాయసం వెంకటశివుఁడు గారు

౧

మాది పండితవంశము. మా ముత్తాత ముత్తాత రాజునొద్ద ఆస్థానపండితుఁడై, అపారధనము నార్జించి, వంశీయులవశముచేసి మఱి దివికేగెను. ఆయన కుమారుఁడు జనకునికిఁ దీసిపోని ప్రతిభావంతుఁడైనను, వేదాంతాధ్యయనమునందే మనసు లగ్నముచేసి, దాన ధర్మములకే తన సర్వస్వమును ధారవోసి, చరితార్థుఁడయ్యెను. వీరి తరువాతివారు అట్టి విద్యానిష్ఠలకు నోఁచుకొనకున్నను, అంతటి ప్రజ్ఞావంతుల వంశమువారమనుగర్వమును మాత్రము విడనాడలేకుండిరి. కస్తురి కట్టిన పుట్టమువలె, మా వంశము నిరతము సుగుణసౌజన్యముల కాకరమై, ప్రజల మన్ననల నందుచుండెను.

మా పై వంశకర్తలలో రెండవవారు సమర్థులు, జ్ఞానసంపన్నులును. తమ వంశీకు లెన్నఁడును జన్మస్థానము విడిచిపోవలదని వారు శాసించిరఁట! వారిమాట జవదాఁటకయె సామాన్యముగ మా కూటములోనివారు మెలంగుచు వచ్చిరి. కుటుంబములు పెరిఁగి, మడిమాన్యములుఁ సన్నగిల్లిన కొలఁదిని, ఈ గ్రామనివాస మతిదుర్భరమగుచు వచ్చినను, మా వంశీకులు 'అవశ్యం పితురాచారం' అను నార్యోక్తి ననుసరించి యీపాటినె యంటిపట్టుకొని, యెటులో జీవితయాత్ర నడుపుకొనుచున్నారు.

మా యీ పూర్వికుఁడు తనకు మిగిలిన ధనరాశి నెచటనో నిక్షేపించి, అది తన వంశము వారికే లభింపఁజేయుట కుద్దేశించి, వారి హృదయలతల నేకీభావమునఁగట్టు గాఢప్రేమ సూత్రముగ నుండుటకే పై నియమమేర్పఱిచెననియు, కావున మా వంశమువా రెపుడును ఇంటిపట్టుననే యుండినచో, కర్మపరిపాకమైన తరుణమున మా పూర్వికులధనము మరల మాకు చేఁజిక్కఁగలదనియు, మా వంశమున గాఢవిశ్వాసము కలదు. కాని యెంత పరిశోధించినను, మా గృహములందు నిధినిక్షేపముల జాడలేమియుఁ గానరావయ్యెను!

౨

ఒకనాఁడు నే నధిక మనస్తాపమున కగ్గమైతిని. నా వంతుకు వచ్చిన చిట్టెడునేలయు మువురు కూఁతుల పెండ్లికొఱకు కుదువపెట్టితిని. ఇరువురుపుత్రులును చదువుసంధ్యలు లేక, వీథులందల్లాడుచుండిరి. పట్టణమేఁగి యే వీథి బడియో పెట్టుకొందునని యొకఁడును, పొరుగూరి నందలి యే కాఫీశాలలోనో చేరి పొట్టపోసికొందునని యొకఁడును జెప్పి, కుమాళ్లు నా యనుమతికై వేధింపఁ జొచ్చిరి. ఇంటికిఁ గావలసిన వస్తువులపట్టి,—ఉత్తరాపథమువలె ననంతమగునది యొకటి;—గృహిణి నా ముందుఁ బఱచెను! క్రొత్తపరికిణీలు కుట్టింపుమని గారాబు కూఁతురును, వెచ్చముల సొమ్మియ్యుఁడని వెంకయ్యసెట్టియును దీర్ఘోపన్యాసములు గావించి యపుడె నిష్క్రమించిరి.

ఈ కష్టములనుండి విముక్తి యెటులా యని విసిగికొని, ఏమియుఁ దోఁపక, ద్వారబంధపు కమ్మిమీఁద చేయి వైచి, అందుండు నొక తాళపత్ర గ్రంథమును దీసి చదువఁజొచ్చితిని. చక్షువులు అక్షరములమీఁద నున్నను, మనస్సుమాత్రము విభీత హరిణమువలె, దిగ్భ్రమణము చేయసాగెను. చదివెడి పద్యముల యర్థము నాకు నచ్చకున్నను, మనోవేగము నరికట్టుటకును, నన్నావరించిన కష్టములు మనస్సునను దోఁపకుండుటకును, పుస్తక కాలక్షేపము నా కుపకరించెను. అంత నాకన్నులకు వింతదృశ్యమొకటి గానవచ్చెను. ఒకానొకపుట చివరను పద్యసంబంధములేని విడి యక్కర మొకటి యుండెను. ఆ యక్షరమునకును, ముందువెనుకటి పత్రములలోని సంగతులకును, బొత్తిగ పొత్తు కలియకుండుట కాశ్చర్యపడితిని. కథాసంవిధానమున నా మనస్సు లగ్నమై యుండినచో, ఆ విడియక్షరమును నా కన్నులుఁ పరిశోధింప కుండెడివియె. కాని, వేరు పనిలేకుండిన హేతువున ఈ స్వల్పవిషయమే నా మనస్సును పట్టుకొని ప్రాఁకులాడుచుం

డెను. నవీనముద్రణ పుస్తకములవలె నీప్రాచీన తాళపత్రగ్రంథములు లేఖక ప్రమాదముల కంతగఁ జోటీయవు. కావున నా యాశ్చర్యము ద్విగుణమై నే నంత పత్రములు తిరుగవేసి, యిట్టి యసందర్భాక్షరము లింకెచటనైనఁ గలవాయని శోధింపఁజొచ్చితిని. అంత నా యాశ్చర్య మేమని చెప్పను? కొన్ని పుటలు దాఁటినవెనుక నింకొక విడి యక్కర మిట్టిదియె కానవయ్యెను. అంతట వెనుకకు పుటలు త్రిప్పి చూడఁగా నిట్టి యక్షరములె ప్రత్యక్షమయ్యెను. వీనియన్నిటి నొక పత్రమున వరుసగాఁ గూర్చి వ్రాసితిని. కాని యా యక్షర సముదాయము అర్థరహితముగ నుండెను. ఈ సంజ్ఞాక్షరముల యర్థపరిశోధనమున నే నే నాదినము గడిపినను, నాకు లాభ మేమియుఁ గలుగలేదు. తమ కార్యార్థము నాయొద్దకు పలుమారు వచ్చి నాకు చిరాకు గల్పించెడి నా కుమారుల నంత నే జూచి, "మీ రీయక్షర సమామ్నాయమునకు సమన్వయముచేసి యర్థము తేల్చితిరా, ఎట్లో మీ యభీష్టము నెరవేర్చెద!" నంటిని. అంత కొన్ని దినములవఱకును తండ్రియు, తనయులును ఈ క్రొత్త వ్యాపృత్తిని మునిఁగి యుండిరి. ఈలోపుగ మా యింటఁ గల తాటియాకుల పుస్తకములన్నియు నేను తిరుగవేసితిని. ఎందును నిట్టి వ్యర్థాక్షర ప్రయోగము గానరాకుండెను. అంత నొకనాఁడు నా చిన్నకుమారుఁడు ఈ యక్షరములచిక్కు విడఁదీయు నుపాయము మాకు చెప్పెను. మొదటియక్షరము పిమ్మట నొక యక్షరము, రెండవ దానివెనుక రెండక్షరములు, మూఁడవసారి మూఁడక్షరములు, ఇవ్విధమున వరుసగా విడిచివైచినయెడల, మిగిలిన యక్షరములు అర్థవంతమయ్యెను! అవి వరుసగా కూర్పఁగా నిటు లయ్యెను: "నిక్షేపము పెరటిగుడిముందు పెద్దచింతక్రిం—!"

గ్రంథపారాయణమున కథామధ్యమున నెవ్వరుగాని నిలువరు. ఆ మఱునాఁటినుండియు నా కుమాళ్లు ఈ నిక్షేపాన్వేషణ కార్యము సర్వవిధముల సాధింపఁబూనిరి. నాయొద్దనున్న తాటియాకుల పుస్తకము అసమగ్రముగ నుండెను. దాని రెండవభాగము మా బంధువులలో నొకరి వంతునకు వచ్చియుండుటచేత, మా చిన్నవాఁడు దాని నొకపరి చదువుటకుఁ బుచ్చుకొని, దానిలోఁగల యధికాక్షరముల నీచొప్పుననే కూర్చి, మొత్తముమీఁద తేలిన అక్షరసమామ్నాయము నిట్లు చదివెను:

"నిక్షేపము: పెరటిగుడిముందు పెద్దచింతక్రింద, తూర్పుదిక్కున తొమ్మిదిమూరలదవ్వున!"

3

అప్పటినుండియు మా యింట నెన్నఁడును లేని యైకమత్యము సమకూరెను. రేయుంబవళ్లు మా హృదయములు ఈ నిక్షేపాన్వేషణమునకె లగ్నమై యుండెను. మాకందఱికిని కొన్ని దివసములవఱకును కనులముందును, కలలందును ప్రాఁతగుళ్లు, బంగరు పెరళ్లును నాట్యము సలుపసాగెను!

"పెరటిగుడి" అను పదసమష్టి దుర్గ్రాహ్యముగ నుండెను. గుళ్లుగోపురములును పెరళ్లలో నుండునా? మా వంశపు వారలకు విశాలమగు పెరళ్లు గ్రామమునఁ గలవు. ఐన నందు దేవాలయములు లేవు. ఊరఁ గొన్ని గుళ్లు గలవు కాని యవి యిండ్లకు దూరమున వీథులలో నుండునట్టివియె. కావున మా కృషియంతయు వ్యర్థమై, యీ నిక్షేపమునుగుఱించి నబీజాక్షరములెపుడును బీజాక్షరములుగనే యుండవలసివచ్చునట్లు తోఁచెను! అంత గ్రామమునఁ వృద్ధులగువారి నడుగఁగా, పూర్వమెకప్పుడు ఈ గ్రామము వేరుప్రదేశమున నుండుచు వచ్చినట్లును, అచట నేదోయొక విప్లవము సంభవింపఁగా, జను లందుండి లేచివచ్చి, యిక్కడ నూతనగ్రామ మేర్పఱచుకొనిరనియును, చాలకాలము క్రితమువఱకును గ్రామప్రదేశము "పాటిపెర" డని వ్యవహరింపఁబడుచుండెననియును దెలిసినది. కాని, యక్కడ గుళ్లేవియు లేవే! నే నొకనాఁ డా ప్రదేశమున కేఁగి, నలుదెసలుఁ బరికించి చూచితిని. ఎచటను పాడుగుడి జాడలు గానరాకుండెను. అంతట నొక చెట్టుక్రిందఁ గూర్చుండి, యాలోచనలలో మునిఁగియుంటిని. చేరువనుండి మేఁకలను మేపుచు ముసలిగొల్లవాఁడొకఁడు పోవుచుండఁగా, వానితో ముచ్చటింపఁదొడఁగితిని. పాడు

గుడినిగుఱించి వానిని ప్రశ్నించితిని. శిథిలమైన గుడియొకటి చిరకాలముక్రిందట నిచట నుండెడిదని వాఁడు నాకొక



ప్రదేశము చూపించెను. అందిపుడు గుడి లేకున్నను, గుడి యానవాళ్లు లేకపోలేదు. పైరాళ్లన్నియు చెదరిపోయి అందిపుడు అడవిచెట్లలముకొనియున్నను, కఱ్ఱతో గొట్టినను, కత్తితోఁ బొడిచినను, నేల 'కంగు'మని మ్రోఁగ సాగెను. అంత నేను చింతను గుఱించి ప్రశ్నించితిని. తా నాచెట్టు చూడలేదుకాని, పెద్ద చింతయొకటి యచట పూర్వ ముండుచు వచ్చెనని చిన్నప్పుడు పెద్దలవలన వినుచుంటినని యతఁడుచెప్పి నాకొకప్రదేశము చూపించెను.

ఎన్నఁడు నేను, నాపుత్రులు నింత జాగరూకతతోఁ బనులు సలుపుచుండువారము కాము. "దరిద్రునికి మనోరథము లధికము." మనోరథసాఫల్యమె మా దారిద్ర్యవిచ్ఛేదమునకు ముఖ్యసాధనమని నమ్మి, మే మమితోత్సాహముతో ఈనిక్షేపాన్వేషణకార్యము సాధింపఁ బూనితిమి.

౪

మా యూరుగపాడున కీప్రాఁత పాటిపెరడు సుమారొక క్రోసుదూరమున నున్నది. పాటిపెరడు, దానిచుట్టు నుండు ప్రదేశమును నేఁటివఱకును మా వంశపువారి భుక్తములో నుండినను, పగటిపూఁట బహిరంగముగ మే మచట త్రవ్వలను పడదుగదా. జ్ఞాతులు, లోకులును మాపని కడ్డంకులు వేయక పోయినను, దాని కనవసరముగ ప్రకటన గావింతు రనుట స్పష్టము. అందువలన మా యుద్దేశమునకు విఘాతము సంభవింపఁగలదు. కావున రాత్రులె మే మీకార్యమును సాధింపఁ దలంచుకొంటిమి. మా కీవిషయమున నెంతో శ్రమగలిగెను. త్రవ్వుపని యొకపూఁటలో తెములునది కాదు. రాత్రిపూఁట పాటిపెరడు అరణ్యసదృశముగ కనఁబడినను; పగలు సేద్యగాండ్రు, పసులకాఁపరులును అచట సంచరించుచునే యుందురు. వీరందఱును అసంపూర్ణముగు మా పని కనిపెట్టరేని, తము ప్రేళ్లందుఁ జొప్పింపక పోయినను, ప్రజలకది ప్రకటింతురనుట స్పష్టము. పగటివలెనే వెన్నెలరాత్రులును మా పనికి విఘ్నకరమె. చీఁకటిరాత్రులందును మాకు చిక్కులు లేకపోలేదు—దీపము లేనిచో మొదట కనులే కనఁబడవుకదా. పురుగుపుట్రలతో నిండియుండు నిర్జన ప్రదేశమున వెలుతురులేక పని యెట్లు సాగును! ఇఁక దీప ముండినచో దూరమునమండువారు సయితము మాజాడలు గనిపెట్టరా? ఐనను ఎట్టి విషమసమస్యా పరిష్కారమునకైనను సాహసకార్యమె ప్రబలసాధనమని నేను కార్యనిర్వహణమునకుఁ గడంగితిని.

అమావాస్యనాఁడు రాత్రి రెండుజాములపుడు నా కుమాళ్లతో గ్రామమునుండి బయలు దేఱితిని. కాళ్లకు మెత్తని చెప్పులు తొడుగుకొని, చేతులందు త్రవ్వుపని ముట్లు, కిరసనాయిలుబుడ్డి, అగ్గిపెట్టెలు నుంచుకొంటిమి. మేము ప్రాఁతగుడిప్రదేశముఁ జేరి మ మ్మెవరైనఁ గనిపెట్టుచుండిరేమోయని యిటునటు పరికించితిమి. కాని చుట్టుప్రక్కలంతటను నిశ్శబ్దముగ నుండెను. మేము దీపము వెలిఁగించి చూచితిమి. జిల్లేడు, కసింద, నేపాళము మొదలగు మొలకల యొండుటాకులు గలగల మనెను. నిద్దుర కలఁతపడిన తొండలు, ఊదుతలు మొదలగు

కీటకము లిటునటు పారిపోయెను. ఎడారి ప్రదేశమునకుఁ గ్రొత్తలగు దీపపుకాంతులచే నాకర్షింపఁబడి దోమలు, నుసుమలును దీపపు బుడ్డిచుట్టునుమూఁగి, అత్యాశాపీడితుఁడగు మనుజుని హృదయమువలెనే తోడ్తోడనె దగ్ధమయ్యెను. త్రవ్వఁగోలతో నేల నచ్చటచ్చటఁగొట్టి, వినవచ్చెడి మ్రోఁతనుబట్టి ప్రాచీన దేవాలయ స్థల నిర్ణయము చేసికొంటిమి. చెట్టుజాడలు గుర్తెఱుఁగుటకై గొల్లవాఁడు చూపిన ప్రదేశమున మేము త్రవ్విచూచితిమి. ఎచటను వేళ్ల యానవాళ్లు గానఁబడలేదు. చిరకాలముగ పడిపోవుటచేత వేళ్లు మట్టిగ మాఱిపోయి యుండవచ్చునని యును, లేనిచో నవి మొదలంట త్రవ్వివేయఁబడి యుండవచ్చునని యును మేము నిర్ధారణ చేసికొంటిమి. ఆ ప్రదేశమున నుత్తర దక్షిణములందును త్రవ్విచూచితిమి. ఐన నెచ్చటను మాకేమియుఁ గానఁబడలేదు. అప్పటికి తూర్పు తెల్లవారుసమయము కావచ్చినందున, నాఁటికి పని నిలిపివైచి పగటిపూఁట జనులకంటికి మా పని కానిపింపకుండునట్లు, త్రవ్విన మట్టి వెనుకటి తావుననే చేర్చి, గోయి పూఁడ్చివైచి, బయలుదేఱి యిలు సేరితిమి.

మఱునాఁటి రాత్రియు నదే సమయమున మేము మువ్వురమును ఇలు వెడలితిమి. కాని, యీనాఁడు మా పిల్లవాఁడు చమురుబుడ్డివిడిచి విద్యుద్దీపపు గొట్టము సంపాదించి, తనతోఁ గొనివచ్చెను. దానిసాహాయ్యమున మేము సుకరముగఁ బనులు చేయఁగలిగితిమి. వలసినపుడు వెలుతురు, లేనపుడు చీఁకటి,—ఇవియె కదా మా పనికిపుడు కావలసిన పరిస్థితులు!

“నిజముగ నిక్షేపమె యిచట నుండినయెడల నేఁడది మన కనులఁ బడవలసినదే!” యని పిల్లవారిరువురును రాక్షసులవలె నారేయి పనులు సాగించిరి. త్రవ్వి త్రవ్వి, “ఇఁక లాభము లేదు. తెల్లవారుచున్నది ఇంటికిఁ బోవుదము!” అని మేమనుకొనుచుండునపుడు చిన్నవాని గునపపుదెబ్బకు ‘కంగు’ మను నొకశబ్దము నేలలోనుండి వినవచ్చెను. అది విని యాశ్చర్యానందములు ముప్పిరిగొన మేము గోతిలోని కట్టె తొంగిచూచితిమి.

ఇంతలో మా కార్యమున కొకవిఘాత మాపాదిల్లెను. కొంతసేపటినుండి మా జాడలు తీయువాఁడెవఁడో దూరమున పొంచుని చూచుచున్నట్లు మా పెద్దవాఁ డనుమానపడుచుండెను. అది వట్టిభ్రమయని మేమెంత చెప్పినను వాఁడు వినక, ఆ మనుష్యుని చెవులు కనఁబడినవని యొకమాఱును, తల పొడగట్టెనని యొకమాఱును, పలవించెను! ఈ కంగుమను చప్పుడు వినఁబడిన యొక నిమిషమునకు మా పెద్దవాఁడు అనుమానపడుచుండిన దిక్కునుండి మా కొకకేక వినవచ్చి, గుండెలు జల్లుమనెను—“వేగముగ గోయిపూఁడ్చు”డని యొకరమును, “మనుష్యుని తరుముఁ”డని మఱియొకరమును కేకలిడితిమి. అంత మా ప్రయత్నమును పరిహసించుటకా యనునట్లు, పదియఱపు లొకసారిగ వినవచ్చెను! ఊరివారందఱును మా మీఁదికెత్తివచ్చినట్టుగఁ దోఁచి, భయభ్రాంతులమై నిశ్చేష్టులమై పోతిమి. కాని, యొకింత ధైర్యము తెచ్చుకొని పరికింపఁగా ఈ యఱచినవి నక్కలని తేలినది. మేమంత వీరావేశమున రాళ్లు రువ్వి, వానిని దరిమివైచితిమి. ఈ క్షుద్రజంబుకములా పురుషసింహులమగు మా పరాక్రమమును పారఁద్రోలఁ గలుగునవి!

దీనికేమి గాని, గునపపుదెబ్బకు మ్రోఁగిన వస్తువేమిటి? పదిమంది మనుష్యులైనను మోయలేని బంగారుగాబు దొరకునని మేమిన్నాళ్లు నువ్విళులూరుచుంటిమి. మూఁడు పదునైదులు ముగిసిన ముదుసలి ముత్తైదువైనను, దొరకు ధనములోఁ దాను మోయఁగల బంగారు ముందుగ తన నగలకై వినియోగింతునని యింటియామెయును, తమ వృత్తివ్యాపారములకు వలసినంతసొమ్ము వెచ్చింతుమని తనయులును ఇన్నిదినములును ఇంట పాటలు పాడుచుండిరి! ఇఁక విరక్తిమార్గముఁ బట్టియున్న నా మనస్సు ఇట్టి హేయ విషయముల మీఁదికిఁ బోవునా? ఐనను ఏకోశమునుండియో ఆశాపిశాచము నా మీఁదఁ గూడ నుఱుక సాగెను. కూఁతుల పెండ్లి యప్పులు తీఱిపోవుటయు, చిరకాలమునుండి చేయుదమను క్రతువు సక్రమముగ సాగుటయు, కర్ణము

లకు కాంచన కుండలములు చేకూరుటయు — ఇవియె నాకుఁగల కోరికలు!

ఈ కోరికల కన్నిటికిని కల్పతరువగు మహావస్తు విపుడు మాకనులఁ బడనున్నది. ఆపదార్థమెంత విస్తీర్ణముగనుండునో యని నివ్వెఱపడుచు, నలుదిక్కులను త్రవ్వి, దాని నెట్టకేలకు పెల్లగించితిమి. కాని, అది మా పిల్లవాని పిడికిలిలో నిమిడిపోయిన చిన్న రాగిగొట్టమె! ఈ యాశాభంగమునకుఁ గుప్పగూలినట్టు క్రుంగిపోతిమి. నే నంత ధైర్యమవలంబించి, "నాయనలారా! ఇఁక చుట్టును మఱియొకమాఱు త్రవ్వి చూడండి. ఇంకే పెద్దవస్తువుగాని కానఁబడనియెడల, ఈ రాగిగొట్టమును యథాస్థానమునందు పూడ్చివేయుఁడు. దీనివలన మనకుఁ గాకపోయిన ముందువారికైనను మనస్సంతృప్తి గలుగవచ్చును!" అని నేను పిల్లలను హెచ్చరించితిని. నా మాటలు మాత్రము వారలకు నచ్చలేదు. వారు చుట్టును త్రవ్వి, మఱి యే వస్తువుగాని యచట లేదని నిశ్చయించుకొని, త్రవ్వినమట్టి వెనుకటి ప్రదేశమునఁ జేర్చి, ఇతరు లానవాలు పట్టకుండ నడవిమొలకల యాకులు, కొమ్మలు నందుపైనఁ బఱచి, రాగిగొట్టము చేతఁ బుచ్చుకొనిరి. ఇపుడె దిశల కేఁగుచుండెడి చీఁకటి గములవలెనే మేమును చిన్నవోయిన మొగములతో నింటిమొగము పెట్టితిమి.

౬

ఇంకఁ జెప్పుట కేమున్నది? సొమ్మంతయు చోరులు కొల్లగొని నప్పటివలె, ఆ దినమున మా యింట నందఱును విషణ్ణవదనులై యుండిరి. నేను మాత్రము పూజ్యులగు మా పూర్వికు లొసఁగిన యా రాగిగొట్టమున కభిషేకము చేసి విధ్యుక్తముగ దానికిఁ బూజా పురస్కారము లొనరించి, పిమ్మట దానిచీల లూడఁదీసి చూచితిని. చిన్న రాగితీఁగచేఁ గూర్పఁబడిన రెండు రాగిరేకు లందుఁ గానవచ్చెను. ఆరెండింటి మీఁదను ఈశ్లోకపాదములు చిత్రింపఁబడియుండెను:—

"ఆశా పరం దుఃఖం"
"నిరాశా పరమం సుఖం"

మడిలోనున్న నా చేతినుండి చివాలున ఆ రాగి రేకులజత నూడఁబెఱికి, నా చిన్నకూఁతురు "ఈతీఁగ వెండి దైనను, తప్పుమంట్లు చేయించుకొందును సుమీ!" యని దైన్యమున విలపించెను. ఎవరేమనుకొన్నను, నేను మాత్రము దిగులుపడక, మహైశ్వర్య సంపన్నుఁడైన మా పూర్వీకుఁడు సాహసమున తన ధనరాసులు దానధర్మములకు వినియోగించి, తన యమూల్యానుభవమును మాత్రము వంశమువారికి శాశ్వత కట్నముగ నొసఁగి నందు కెంతయు కృతజ్ఞుఁడనై, ఈ కార్యసాఫల్య విషయమై నా ధర్మము నేఁ జేసి ధన్యుఁడ నైతినని యుప్పొంగితిని. నేఁటికిని దేవతార్చనా సమయమున నే నాపవిత్రపేటికను భక్తిశ్రద్ధలతో పూజించుచున్నాఁడను. మనపూర్వులొసఁగు కాంచనాదులు క్షణభంగురములు; వారు చేసెడి ధర్మోపదేశము మాత్రము శాశ్వతజీవము గలిగి తదనుసారులకు వారలను తప్పక తరింపఁజేయును.

దశకంఠరావణతత్త్వము

శ్రీ విక్రమదేవవర్మ గారు

పదుగురి గొంతులపగిది ధ్వనించుటన్ దశకంఠరావణ నామ మబ్బె
నగము పేరునుగూడ జగమున వాడుటన్ దశకంఠ యని రావణా యనుచును
బిలువంబడుచు నుండ నల కంఠపర్యాయము లగు గ్రీవాకంధరలును జేరెఁ
దరువాతఁ బదితల లిరువది చేతులు కల్పించినాఁ డాదికవివరుండు
గాని చోఁ బాదయుగ మంత కాయభరము - మోయఁగల్గెనె? యటువంటిబూఁచిఁ గనిన
జనని మని మఱి పిల్లలం గనెనె జగతి? - నట్టేడు జనించిన నపుడ గిట్టకున్నె?